ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాజ్యాంగం



రాజాం సిటీ: కోర్టు సముదాయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి బాబు, తదితరులు

వాడవాడలా గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజున ఏటా ఇలా పండగలా చేసుకుంటుండడం విశేషం కాగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా జాతీయ జెండా ఆవిష్కరించి, రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాజ్యాంగమని, దీంతో దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంతటి మహోన్నతమైన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందన్నారు.

–సాక్షి నెట్‌వర్క్.



రాజాం: మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ తదితరులు



రాజాం: మారేడుబాక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



వంగర: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ



సంతకవిటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు ఏర్పడి, జెండా ఊపుతున్న దృశ్యం



రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగం ఆవశ్యకతను వివరిస్తున్న తహసీల్దార్ సులోచనాణి



సంతకవిటి: పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న పోలీసులు



రామభద్రపురం: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రమామణి, జెడ్పీటీసీ సరస్వతి



రాజాం సిటీ: పొగిరిలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ ఆవశ్యకతను వివరిస్తున్న వక్త



రాజాం సిటీ: కంచరాంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



రేగిడి: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రిపబ్లిక్ డే వేడుకలు



వంగర: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఐజాక్



బాడంగి: తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ రఫీజాన్



బాడంగి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జెండా వందనం చేస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ గౌరి



రామభద్రపురం పోలీస్‌స్టేషన్ వద్ద జెండా వందనం చేస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది



తెర్లాం: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామ సచివాలయంలో ప్రభుత్వం అందించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు చేతులమీదుగా లబ్ధిదారులకు శుక్రవారం అందించారు. ఈ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శి దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

52 మద్యంసీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మండలంలోని వెంకంపేట గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 52 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. మద్యం అమ్మకాలపై తమకు అందిన ముందస్తు సమాచారంతో తనిఖీలు చేసి, మద్యంబాటిళ్లను పట్టుకున్నామన్నారు. ఈ ఘటనకు సంబంధించి, కేసు నమోదు చేసి, బెవర అప్పయమ్మ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు.

ధర్నా



కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు

బొబ్బిలి: కేంద్రంలోని బీజేపీ ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తోందని ఆరోపిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల నేతలు స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ ఎన్నో హామీలు ఇచ్చారని, అవేవీ నెరవేర్చలేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్యుడికి అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నేతలు పొట్నూరు శంకరరావు, సింగిరెడ్డి గోపాలం, పిల్లా లక్ష్మణరావు, మునకాల శ్రీనివాసరావు, తాళ్లపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన



పైపులైన్ ఏర్పాటుకు చేస్తున్న మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులను జెడ్పీటీసీ బండి నర్సింహులు శుక్రవారం పరిశీలించారు. రూ.40 లక్షల వ్యయంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రస్తుతం పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు జెడ్పీటీసీ సూచించారు.

చురుగ్గా కులగణన సర్వే



వంగరలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగి

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. 19 గ్రామ సచివాలయాల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు, గ్రామవలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేర వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 90 శాతం పైబడి కుటుంబాలను సర్వే చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం

మెరకముడిదాం: మండలంలోని పెదపూతికవలస గ్రామానికి సంబంధించి ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులుగా జమ్ము లక్ష్మిని అధికారులు నియమించారు. ఎంపీడీఓ ఎం.రత్నం శుక్రవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, ఉపాధిహామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

షర్మిల వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం జరిగేలా చేసి, ఆ తర్వాత అడ్రస్ లేకుండా పోయిన కాంగ్రెస్ పార్టీ పంచన షర్మిల చేరి, రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి నిత్యం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం ఎంతమాత్రం తగదన్నారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదవడం కాదని, వాస్తవాలు ఏమిటో తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. నిన్నమొన్నటి వరకు జగనన్న వదిలిన బాణమని, ఇప్పుడు కాదంటావా నీ పొంతన లేని మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. రాజన్న రాజ్యం తెస్తానని తెలంగాణలో సొంతగా పార్టీని పెట్టి, అదే పార్టీని కాంగ్రెస్‌లో ఇప్పుడు విలీనం చేసి, అక్కడి ప్రజలను మోసం చేయలేదా అని ప్రశ్నించారు. ఇక్కడ జగనన్న ఇచ్చిన మాట తప్పకుండా ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపిస్తూ అనేకానేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. దేశం మెచ్చుకుంటున్న నేతగా తమ ముఖ్యమంత్రి ఎదుగుతున్నారని, అటువంటి వ్యక్తిపై లేనిపోనివి మీడియా ముందు చెబుతుండడం వెనక ఎవరున్నారో ప్రజలకు బాగా తెలుసన్నారు. తన వల్ల లబ్ధి జరిగితేనే ఓటు వేయండి అని అడుగుతున్న ఏకైక నాయకుడు తమ అధినేత సీఎం జగన్ అన్నారు. మీరు, టీడీపీ దాని తోక పార్టీలన్నీ కట్టకట్టుకుని వచ్చినా బెదిరేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ తమ పార్టీ విజయం తథ్యమన్నారు. మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం అవుతారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంపై మీ తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, పార్టీ సీనియర్ నేత ఎస్.వేణుగోపాలనాయుడు, బొబ్బిలి, తెర్లాం మండలాల పార్టీ అధ్యక్షులు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, తెంటు సత్యంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు రజక వీధిలోని పలు సంఘాల నేతలు, వైఎస్సార్ సీపీ నాయకులను కలిసిన ఆయన మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో తనను, పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీని నమ్మొద్దని, టీడీపీకి ఓట్లు వేస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కనుమరుగవుతాయని, రాష్ట్రం అధోగతి పాలవుతుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రాజాం మత్స్యకార సంఘం నేతలు విష్ణుపాత్రుని శంకరరావు, సురేష్, వినోద్, రజక సంఘం నేతలు యండమూరి వాసు, కొమరపులి గౌరి, కొమరపురి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ‘ఉపాధి’ పనులు



లచ్చారాయపురంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, లచ్చారాయపురం, జాడాపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. జాబ్‌కార్డులు కలిగిన వేతనదారులంతా నిర్దేశిత కొలతల్లో పనులు చేస్తున్నారు. లచ్చారాయపురంలో జరుగుతున్న పనులను ఏపీవో హరనాథరావు శుక్రవారం పరిశీలించి, పనులకు వచ్చిన వారికే మస్తరు వేయాలని, గిట్టుబాటు వేతనం వచ్చేలా పనులు చేయించాలని సిబ్బందికి తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం..



రక్తదానం చేస్తున్న యువకులు

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని పార్వతీపురం ఏపీపీ కిమిడి చంద్ర కుమార్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలసలో పాలకొండ విజయ ఆస్పత్రి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి, రక్తం దానం చేసేందుకు యువత ముందుకురావాలని కోరారు. రక్తం దానం చేయడం ద్వారా మళ్లీ కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని, ఆరోగ్యవంతమైన మనిషి ప్రతీ మూడు నెలలకోసారి రక్తం దానం చేయవచ్చన్నారు. పాలకొండ విజయ ఆస్పత్రి ఎండీ డి.పద్మావతి మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అత్యవసరమని, అటువంటి వారి కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. దాతల ద్వారా మొత్తం 45 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శాసపు వేణుగోపాలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, యువ న్యాయవాది లావేటి బాలకృష్ణ, ఎస్.అప్పలనాయుడు, ఎస్.దివాకర్, ఎం.లోకేష్, సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

• వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే శంబంగిని కలిసిన మాజీ సైనికులు

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మాజీ సైనికులంతా శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్నేళ్లుగా ఇక్కడి ప్రజాప్రతినిధులను ఇళ్లస్థలాలు ఇమ్మని కోరుతున్నామని, అయినా తమకు న్యాయం చేయడం లేదన్నారు. తప్పకుండా ఇళ్లస్థలాలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వారంతా కలిసి ఎమ్మెల్యేకు జాతీయ జెండా, జ్ఞాపికను బహూకరించారు. అంతకుముందు పెట్రోల్ బంకు ఆవరణలో వారంతా కలిసి, గణతంత్ర వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు మరడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు రామభద్రపురం విద్యార్థులు



కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కొట్టక్కి విద్యార్థులను అభినందిస్తున్న వేణుగోపాలనాయుడు

రామభద్రపురం: బొబ్బిలిలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో రామభద్రపురం మండల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు రత్నకిశోర్, వి.అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. కొట్టక్కి సచివాలయం పరిధిలోని విద్యార్థులు కబడ్డీ పోటీలు, ఆరికతోట సచివాలయం పరిధిలోని విద్యార్థులు ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరంతా విజయనగరంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే రామభద్రపురం-3 సచివాలయం పరిధిలోని విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. సదరు క్రీడాకారులను బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు అభినందించారు.

పేదలకు అన్నదానం



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వెంకటరావు

జామి: మండల కేంద్రమైన జామిలో జె.డి.వలస గ్రామానికి చెందిన కొల్లూరు చినవెంకటరావు తనతల్లి జ్ఞాపకార్థం శుక్రవారం పలువురు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేయడంలో తనకు సంతృప్తి ఉంటుందని ఆయన తెలిపాడు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు సుబ్బలక్ష్మి, ఐ.సుబ్బరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొబ్బిలి: పట్టణ శివారులోని మిలటరీ కాలనీ పరిసరాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం పట్టుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.49,990 నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ జి.భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆకస్మికదాడులు నిర్వహించి, జూదరులను పట్టుకున్నామని పేర్కొన్నారు.

28న ఉచిత వైద్యశిబిరం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 28వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఈశ్వరప్రసాద్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. శ్రీయోగ విద్యాసంస్థ ఆధ్వర్యంలో విశాఖ, బొబ్బిలి ప్రాంతాలకు చెందిన ఆక్యుపంచర్ హీలర్స్ వైద్యసేవలందించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత దంత వైద్యశిబిరం

రామభద్రపురం: స్థానిక ఎస్ఆర్ఐ ఆస్పత్రి వద్ద ఈ నెల 28వ తేదీన ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ పార్టనర్ వరప్రసాద్ తెలిపారు. ఆస్పత్రి వద్ద వైద్యులు హరిజగన్, బాలభార్గవిలతో కలిసి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దంతాలకు సంబంధించిన అన్ని రకాల వైద్యపరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామన్నారు.

క్రీడాకారులకు అభినందన

గజపతినగరం: ‘ఆడుదాం ఆంధ్రా’ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ఖోఖోలో మరుపల్లి జట్టు విజయం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జ్ చింత సత్యనారాయణ అన్నారు. కబడ్డీ బాలుర విభాగంలో గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం, బాలికల విభాగంలో బొండపల్లి జట్లు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విజయం సాధించిన క్రీడాకారులను శుక్రవారం ఆయన అభినందించారు.